క్లుప్తంగా

నేత్ర వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న ఆప్తాలమిక్ మౌనిక

గజపతినగరం: స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి గజపతినగరంతో పాటు మెంటాడ, బొండపల్లి మండలాల నుంచి వచ్చిన 74 మందికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ మౌనిక, సిబ్బంది నేత్రపరీక్షలు చేశారు. వీరిలో 27 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారని, విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, సాయిరేవంత్ తెలిపారు. శిబిరానికి వచ్చిన వారికి నిర్వాహకులు భోజనాలు ఏర్పాటు చేశారు. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు ఆషిక్, కార్తీక్, నాయుడు, క్యాంప్ కో–ఆర్డినేటర్ వెంకటరమణ, పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం



జగదీష్‌కు నగదు అందజేస్తున్న ఆదిబాబు

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ రాజీపేట గ్రామానికి చెందిన జుత్తాడ జగదీష్ జాతీయస్థాయి కరాటే పోటీలకు అర్హత సాధించాడు. పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లేందుకు క్రీడాకారుడికి గ్రామానికి చెందిన పెద్దలు తూర్పాటి ఆదిబాబు సోమవారం రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. గ్రామస్తులు పి.వెంకటరావు, తూర్పాటి నాయుడు, గోపిశెట్టి నాయుడు తదితరులు జగదీష్‌ను అభినందించారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి..



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

బొండపల్లి: పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మెరుగైన ఫలితాలు సాధించాలని గొట్లాం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి. శ్రీరామాచారి అన్నారు. పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగినప్పుడు ఎదుగుదల ఉంటుందని చెప్పారు. అనంతరం విద్యార్థులు పలు గీతాలు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యు.సత్యానంద్, తదితరులు పాల్గొన్నారు.


ప్రజా మద్దతు కోరాలి..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు

వేపాడ: బూత్ కమిటీ సభ్యులు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, మద్దతు కూడగట్టాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గుబాబు అన్నారు. మండలంలోని రామస్వామిపేటలో వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయం పరిధిలో ఉన్న 70,71 బూత్‌లకు సంబంధించి కమిటీ సభ్యులు ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించి, వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్లమాని శర్మ, ఎం.జగ్గుబాబు, ఉప సర్పంచ్ ముమ్ములూరి వాసు, కమిటీ సభ్యులు జి.రామారావు, ఎం.సత్తిబాబు, గృహసారథులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం సందర్శనకు పయనం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న బొత్స సందీప్

చీపురుపల్లిరూరల్(గరివిడి): విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 206 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహం సందర్శనకు మంత్రి బొత్స సత్యనారాయణ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో చీపురుపల్లి నియోజ కవర్గ బడుగు,బలహీన వర్గాల నాయకులు సోమవారం పయనమయ్యారు. ఈ బస్సును ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్క ర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. విజయవాడ నడిబొడ్డున సుమారు 19 ఎకరాల విస్తీర్ణంలో అంబేడ్కర్ స్మృతి వనాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల సమరానికి సిద్ధం



బూత్‌కమిటీ సభ్యులకు కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- పార్టీ విజయానికి సైనికుల్లా పని చేద్దాం
- సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలి
- బూత్ కమిటీల సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన

చీపురుపల్లిరూరల్(గరివిడి): రానున్న సార్వత్రిక ఎన్నికల సమరానికి వైఎస్సార్‌సీపీ బూత్‌కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ డిప్యూటీ కో–ఆర్డినేటర్, జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.గరివిడి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో చీపురుపల్లి నియో జకవర్గంలోని గరివిడి, చీపురుపల్లి, మెరకముడిదాం, గుర్ల మండలాల పార్టీ బూత్ కమిటీ సభ్యుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయం సమీపిస్తోందని, బూత్ కమిటీ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలని కోరారు. నియోజకవర్గంలోని 258 పోలింగ్ కేంద్రాలకు ఇది వరకే బూత్ కమిటీ సభ్యులను నియమించామని, వీరంతా తమ బూత్‌ల పరిధిలో ఓటర్ల జాబితాను పరిశీలించి, ఓటర్లు స్థానికంగా ఉన్నారా లేదా దూరప్రాంతాల్లో ఉన్నారా అనేది చూసుకోవాలని సూచించారు.

టీడీపీ,ఎల్లోమీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వంపై టీడీపీ, జనసేన, ఎల్లోమీడియా చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని, వాస్తవాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి రానున్న 45 రోజులు ఎంతో ముఖ్యమని, బూత్ కమిటీ సభ్యులు, కన్వీనర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమాన్ని ప్రజల్లోనికి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని, ఇందు కోసం సోషల్ మీడియా, ఇతర సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవాలని చెప్పారు. మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో చీపురుపల్లి సీహెచ్‌సీని ప్రభుత్వం వందపడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసిందని తెలిపారు. చీపురుపల్లిలో రెవెన్యూ డివిజన్, డీఎస్పీ కార్యాలయాలు ఈ ప్రభుత్వంలోనే మంత్రి బొత్స కృషి వల్లే వచ్చాయని తెలిపా రు. మేము చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు తెలుసని, టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి ఏమిటో నియోజకవర్గ టీడీపీ నాయకులు చెప్పాలని అన్నారు. అనంతరం బూత్ కమిటీ సభ్యులకు కిట్లు అందజేశారు. ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్ బాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, జెడ్పీటీసీలు వాకాడ శ్రీనివాసరావు, సీర అప్పలనాయు డు, సీనియర్ నాయకుడు కె.వి.సూర్యనారాయణరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గరివిడి,చీపురుపల్లి మండల అధ్యక్షుడు కొణిశ కృష్ణంనాయుడు, ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, పార్టీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లా న వంశీకృష్ణ, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్, పొట్నూరు సన్యాసినాయుడు, జమ్ము స్వామినాయుడు, బెల్లాన బంగార్రాజు, మధు సూదనరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బూత్ కమిటీ సభ్యులు

గ్రామస్వరాజ్యం సాకారం



అలమండ సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కడుబండి

జామి: మహాత్మా గాంధీజి కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. అలమండ గ్రామంలో సచివాలయం, జా గరం గ్రామంలో రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్ద కు పాలన తీసుకువచ్చారని అన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లంచాలకు తావులేకుండా ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుతున్నా యని, ప్రజల సమస్యలకు గ్రామాల్లోనే పరిష్కారం లభిస్తోందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ సమప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలోనే అమలవుతున్నాయని వివరించారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, మాజీ ఎంపీపీ కాకర్లపూడి సూరిబాబురాజు, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, అలమండ,జాగరం సర్పంచ్‌లు కోట పాపమ్మ, వసి పార్వతి, జాగరం ఎంపీటీసీ పాడిపిరెడ్డి ఎర్నాయుడు, ఉపసర్పంచ్ లగుడు దేముడు, ఎంపీడీఓ తిరుమలరావు, పీఆర్ జేఈ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ విశ్వేశ్వరరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): బాల్య వివాహాలను నిర్మూలించాల్సి బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు అన్నారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఐసీడీఎస్ పీఓ ఆరుద్ర ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన, బాల్య వివాహాల నిరోధక కమిటీల ఏర్పాటుపై సోమవారం అవ గాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ అవగాహన లేమి కారణంగా కొంతమంది తల్లిదండ్రులు ఆడపిల్లలకు బాల్యవివాహాలు చేస్తు న్నారని, దీని వల్ల ఆడ పిల్లలు శారీరకంగా, మానసికంగా అనారోగ్యాల బారిన పడుతున్నారని, ఎంతోమంది జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాల్యవివాహాలు చేస్తే పడే శిక్షలపై మండలస్థాయి కమిటీ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పీఓ ఆరుద్ర మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక మండలస్థాయి కమిటీలో సీఎంపీఓలుగా తహసీల్దార్, ఎంపీడీఓ, మండల విద్యాశాఖాధికారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉంటారని, ప్రాజెక్టు స్థాయిలో సీడీ పీఓ, పోలీస్‌స్టేషన్ పరిధిలో చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉంటారని తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ చైర్మన్‌గా తొమ్మిది మందితో కూడిన కమిటీ ఏర్పాటు చేసుకో వాలని సూచించారు. ఎంపీడీఓ నిశ్చల, ఎంఈఓలు పి.రామారావు,అప్పన్న, ఏపీఎం పద్మ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జీవితం ఆదర్శప్రాయం




విద్యార్థులకు వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలు అందజేస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్, తదితరులు

- డిపో మేనేజర్ రమేష్

శృంగవరపుకోట: స్వామి వివేకానంద జీవితం ఆదర్శప్రాయమని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కె. రమేష్ అన్నారు. పట్టణంలోని శ్రీరవితేజ పాఠశాలలో మోక్ష విద్య యోగామందిర్ ఆధ్వర్యంలో 'స్వామి వివేకానంద జీవితం – సందేశం' అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివేకానంద జీవితాన్ని తెలుసుకుంటే యువత శక్తివంతమవుతుందని చెప్పారు. అనంతరం స్వామి జీవితచరిత్రకు సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీబీ వెంకటరావు, పాఠశాల కరస్పాండెంట్ పి.కృష్ణారావు, మోక్ష విద్య యోగా మందిర్ కార్యదర్శి శీలా కోటేశ్వరరావు, ఆర్టీసీ ఉద్యోగులు సన్నిబాబు, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

టెంట్లు తప్పనిసరి

మెరకముడిదాం: ఉపాధి పనుల ప్రదేశంలో వేతనదారులు ఎండవేడిమికి గురికాకుండా తప్పనిసరిగా టెంట్లు ఏర్పాటు చేయాలని ఉపాధి సిబ్బందికి ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్ర కుమార్ ఆదేశించారు. సింగవరంలోని మనిపూరి చెరువులో చేపడుతున్న ఉ పాధి పనులను సోమవారం ఆయన పరిశీలించా రు. వేతనదారులతో ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన రోజువారీ గరిష్ట వేతనం రూ.272 అందుతుందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమచికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ సత్య నారాయణ, మేట్లకు సూచించారు.



మెరకముడిదాం: వేతనదారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్

కొత్తబగ్గాంలో...

గజపతినగరం రూరల్: కొత్తబగ్గాంలోని చెరువులో ఉపాధి పనులను ఏపీఓ రామారావు సోమవారం పరిశీలించారు. రెండుపూటలా పనులకు హాజరు కావాలని వేతనదారులకు సూచించారు.ఆయన వెంట ఫీల్డ్‌అసిస్టెంట్ రామునాయుడు ఉన్నారు.

8న జిల్లాస్థాయి పోటీలు

బొండపల్లి: కొత్తపాలెంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల8వ తేదీన కృష్ణమ్మతల్లి పేరంటాల జాతర నిర్వహించనున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు రాము తెలిపారు. సంబంధిత వాల్ పోస్టర్లు, కరపత్రికలను కొత్తపాలెంలో సోమవారం ఆవిష్కరించారు.జాతర సందర్భంగా జిల్లాస్థాయి ఎడ్లు, గుర్రం పరుగు పోటీలు, వాలీబాల్, సంగిడి రాళ్ల పోటీలు నిర్వహించనున్నామనిచెప్పారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

అర్జీలను పరిష్కరించండి

బొండపల్లి: స్పందనలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ ఎస్. హరిహరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. .

గడ్డివాములు దగ్ధం

గజపతినగరం రూరల్: మధుపాడ గ్రామంలో రైతులు ఆకలి తౌడు, దావాల ముత్యాలనాయుడులకు సంబంధించిన గడ్డివాములు సోమవారం దగ్ధమైనట్లు గజపతినగరం అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ తెలిపారు. స్థానికంగా ఎవరో సిగరెట్ పీకను గడ్డివాములపై విసిరేయడంతో ప్రమాదం సంభవించి ఉండవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. సుమారు రూ.30వేల ఆస్తినష్టం సంభవించి ఉంటుందని అంచనా వేశారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

వేపాడ: కృష్ణారాయుడుపేట సమీపంలో సారా తయారీకి నిల్వ చేసిన సుమారు 1500 లీటర్ల బెల్లం ఊటను వల్లంపూడి ఎస్‌ఐ రాజేష్, పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు గ్రామ సమీపంలోని తోటల్లో సారా స్థావరాలపై దాడులు చేశామని ఎస్‌ఐ చెప్పారు. బెల్లం ఊటను పారబోసి, సామగ్రిని ధ్వంసం చేశామని పేర్కొన్నారు.

పరామర్శ

దత్తిరాజేరు: మండలంలోని చుక్కపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చుక్క మురళి తల్లి చుక్క సూరమ్మ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య సోమవారం చుక్కపేట వెళ్లి మురళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే దత్తి గ్రామ వైఎస్సార్‌సీపీ కార్యకర్త గెద్ద శ్రీరామ్ భార్య కొద్ది రోజుల క్రితం మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట మండల నాయకులు ఉన్నారు.



దత్తి గ్రామంలో శ్రీరామ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

సమన్వయంతోనే పారదర్శకంగా పోలింగ్



మాట్లాడుతున్న ఆర్డీఓ శాంతి

చీపురుపల్లి: సెక్టార్ ఆఫీసర్లు, పోలీసులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓల సమన్వయంతోనే పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ సాధ్యమని ఆర్డీఓ బి.శాంతి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల బీఎల్‌ఓలు, పోలీస్ అధికారులు, సెక్టార్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత, పారదర్శక పోలింగ్‌లో బీఎల్‌ఓలు కీలకపాత్ర పోషించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సదుపాయాలు, సౌక ర్యాలు ఉన్నాయో లేదో ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. బీఎల్‌ఓలకు, సెక్టార్ ఆఫీసర్లకు పూర్తి సమన్వయం ఉండాలని అన్నారు. బీఎల్‌ఓలు గ్రామ స్థాయిలో బూత్ లెవెల్ అవేర్‌నెస్ గ్రూపులు ఏర్పాటు చేసి అందులో నెహ్రూ యువ కేంద్రం సభ్యులు, రెడ్‌క్రాస్ సొసైటీ వంటి సంఘాల సభ్యులను చేర్పించి ఓటు హక్కు వినియోగం పై ఓటర్లకు అవగాహన కల్పిస్తుండాలన్నా రు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పోలీస్ అధికారులు ముందుగానే గుర్తించి అక్కడ ఎలాం టి సమస్యలు లేకుండా ముంద స్తు చర్యల్లో భాగంగా అవసరమైతే అధిక బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ముందుగానే అవగాహన సదస్సులు నిర్వ హించాలన్నారు. ఈసారి ఎన్నికల్లో ఉద్యోగుల మాదిరిగానే మంచం పట్టి ఉన్న, శాశ్వత అంగవైకల్యం ఉన్న ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్లు ఇచ్చేందుకు ఎన్నికల కమిషన్ నిర్ణ యించిందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులను బీఎల్‌ఓలు గుర్తించాలని ఆదేశించారు. చీపురుపల్లి తహసీల్దార్ ఎన్.ప్రసాద్, ఎస్‌ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు, ఎన్నికల డీటీ బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం



జాగరం పర్యటిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: సంక్షేమమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జాగరం గ్రామంలో సోమవారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు కడుబండికి హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ, సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గత ప్రభుత్వం మాటల ప్రభుత్వమైతే, తమది చేతల ప్రభుత్వమని చెప్పారు. సంక్షేమ పథకాలు కొన సాగాలంటే వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండాలని తెలిపారు. పేదలు, మహిళల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు మోసపూరిత మాటలు చెప్పి మోసం చేసేందుకు వస్తారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, ,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవి కుమార్, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, సర్పంచ్ వసి పార్వతి, ఎంపీటీసీ సభ్యుడు పాడిపిరెడ్డి నరసింహనాయుడు, పలువురు నేతలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్లడ్ బ్యాంక్ ప్రారంభం

చీపురుపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నిర్మించిన బ్లడ్ బ్యాంకును రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం మధ్యాహ్నం ప్రారంభించ నున్నారని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తెలిపారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన ఈ బ్లడ్ బ్యాంక్ ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు,ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

పథకాలను సద్వినియోగించుకోండి

బొండపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై మండలంలోని అంబటివలస గ్రామంలో సోమవారం ఇంటింట ప్రచారం చేశారు. ఆ పార్టీ నాయకులు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నా రు.

జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

చీపురుపల్లి: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని రాజమండ్రికి చెందిన సాదు జనార్ధనరావు మెమోరియల్ సొసైటీ ఆర్గనైజర్ సాదు వెంకట కోటేశ్వరరావు సూచించారు. లైఫ్ స్కిల్స్‌పై స్థానిక బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు కలిగి ఉన్న విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని చెప్పారు. 8వ తరగతి నుంచే విద్యార్థులు జీవన నైపుణ్యాలు తెలుసుకోవాలన్నారు. క్రమశిక్షణతో పెద్దలను గౌరవించడం, సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకోవాలని చెప్పారు. ఎస్ఎస్ఏ రిటైర్డ్ పీఓ సంగంరెడ్డి లక్ష్మణరావు మాట్లాడుతూ నిరంతర శ్రమ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతోనే విజయాలు సాధించగలమని చెప్పారు. హిందీ ఉపాధ్యాయుడు ఎస్.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

నారీ శక్తి మారథాన్

గజపతినగరం రూరల్: బీజేపీ జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వనితా శ్రీనివాసం ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని ఆధ్వర్యంలో సోమవారం 'నారీ శక్తి వందన్ మారథాన్' నిర్వహించారు. రన్‌ఫర్ నేషన్, రన్ ఫర్ మోడీ నినాదంతో మరుపల్లి గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల మేర చేసిన ఈ మారథాన్‌లో మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు. బీజేపీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు గండికోట శాంతి, నాగమల్లిక తదితరులు పాల్గొన్నారు.



మారథాన్‌లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పావని, విద్యార్థులు

వంద రోజుల పని తప్పనిసరి



ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ ఉమాపరమేశ్వరి

దత్తిరాజేరు: ఉపాధి వేతనదారులందరికీ వంద రోజుల పని కల్పించాలని డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రకుమారి అధ్యక్షన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీలు 35 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులు, మెటీరియల్ వినియోగం, తదితర అంశాలపై గుర్తించిన లోపాలు, ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు, వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, ఏపీడీ జనార్దన్, ఏపీఓలు వెంకటప్పలనాయుడు, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.